నేటి మ్యాచ్ | దక్షిణాఫ్రికా X ఇంగ్లండ్ మ.2.30 నుంచి

హర్ష్‌దూబే (3/88)

హర్ష్ దూబే కొత్త చరిత్ర

ఒక సీజన్‌లో అత్యధిక వికెట్లతో రికార్డు ● కేరళతో విదర్భ రంజీ ఫైనల్ పోరు

నాగపూర్: సుదీర్ఘ రంజీ ట్రోఫీ చరిత్రలో కొత్త రికార్డు నమోదైంది. ఈ సీజన్ ఆసాంతం తన అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతున్న విదర్భ లెఫ్టార్మ్ స్పిన్నర్ హర్ష్‌దూబే కొత్త చరిత్ర లిఖించాడు. ఒక సీజన్‌లో అత్యధిక వికెట్లు(69) తీసిన బౌలర్‌గా దూబే అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో 2018-19 సీజలో బీహార్‌కు చెందిన అషుతోశ్ అమన్(68) నెలకొల్పిన రికార్డును దూబే తాజాగా బద్దలు కొట్టాడు. తన లెఫ్టార్మ్ స్పిన్ మాయాజాలంతో దూబే వికెట్ల పండుగ చేసుకున్నాడు. పిచ్ ఏదైనా తన స్పిన్ తంత్రంతో బ్యాటర్ల దూకుడుకు కళ్లెం వేస్తూ టాప్ వికెట్‌టేకర్‌గా నిలిచాడు. ఇదిలా ఉంటే ఓవర్‌నైట్ స్కోరు 131/3 తొలి ఇన్నింగ్స్‌కు దిగిన కేరళ 342 పరుగులకు ఆలౌటైంది. ఓవర్ నైట్ బ్యాటర్లు కెప్టెన్ సచిన్ బేబి(98), ఆదిత్య సర్వతె(79) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. విదర్భ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు నాలుగో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఓవైపు వికెట్లు పడుతున్నా..సచిన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. నిదీశ్(1)ను ఔట్ చేయడం ద్వారా దూబే(3/88) నయా రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. మరో రెండు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో విదర్భ 37 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నది.

సెమీస్‌కు ఆసీస్

వర్షంతో అఫ్గాన్‌తో మ్యాచ్ రద్దు ● తడిసి ముద్దయిన గడాఫీ స్టేడియం ● చాంపియన్స్ ట్రోఫీని వెంటాడుతున్న వరుణుడు

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీని వరుణుడు నీడలా వెంటాడుతూనే ఉన్నాడు. రాకరాక 29 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐసీసీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న పాకిస్థాన్‌కు ఏదీ కలిసి రావడం లేదు. ఆతిథ్య హోదాలో కనీసం ఒక్క మ్యాచ్ గెలువని పాక్ మెగాటోర్నీ నుంచి నిష్క్రమించగా, వర్షాల కారణంగా చాంపియన్స్ ట్రోఫీకి కల లేకుండా పోయింది. శుక్రవారం కీలకమైన ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్ మ్యాచ్‌కు వరుణుడు మరోమారు అడ్డంకిగా నిలిచాడు. ఎడతెరిపిలేని వర్షంతో లాహోర్ గడాఫీ స్టేడియం తడిసి ముద్దవడంతో మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆసీస్, అఫ్గన్ మ్యాచ్ ఎలాంటి ఫలితం లేకుండానే ముగిసింది. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించడంతో ఆసీస్(0.475) నాలుగు పాయింట్లతో సెమీస్‌కు అర్హత సాధించగా, అఫ్గన్(-0.990) మూడో స్థానంలో ఉంది. శనివారం ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మ్యాచ్ ద్వారా మరో సెమీస్ బెర్తు ఖరారు కానుంది. ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా గెలిస్తే..(గ్రూపు-బి టాపర్‌గా సెమీస్‌లోకి ప్రవేశిస్తుంది. ఒక వేళ ఇంగ్లండ్ 207 పరుగుల భారీ తేడాతో సఫారీలను ఓడిస్తే..అప్పుడు మూడో స్థానంలో ఉన్న అఫ్గన్‌కు అవకాశం లభిస్తుంది. ఒక రకంగా ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫలితంపై అఫ్గన్ సెమీస్ ఆశలు ఆధారపడి ఉన్నాయి.

అఫ్గన్ 273:

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ 50 ఓవర్లలో 273 పరుగులు చేసింది. యువ బ్యాటర్ సెదీకుల్లా అటల్(85), అజ్మతుల్లా ఒమర్జాజ్(67) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. ఓపెనర్ రహ్మనుల్లా గుర్జాబ్(0) డకౌట్‌గా వెనుదిరుగగా, రహ్మత్‌షా(12), కెప్టెన్ హష్మతుల్లా(20), ఇబ్రహిం(22) నిరాశపరిచారు. ఆసీస్ బౌలింగ్‌ను దాడిని దీటుగా ఎదుర్కొంటూ సెదీకుల్లా తన కెరీర్‌లో రెండో అర్ధసెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. అయితే కంగారూ బౌలర్లు పుంజుకోవడంతో ఓ దశలో అఫ్గన్ 182 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అజ్మతుల్లా 5 భారీ సిక్సలతో దుమ్మురేపాడు. నాథన్ ఎలీస్ బౌలింగ్‌లో అజ్మతుల్లా 102 మీటర్ల దూరంలో కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. ఆఖరి వరుస బ్యాటర్లతో కలిసి అజ్మతుల్లా ఆసీస్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. మ్యాచ్ మొత్తంలో ఆసీస్ బౌలర్లు 17 వైడ్లు వేసి మూల్యం చెల్లించుకున్నారు. డ్వారిష్(3/47)కు మూడు వికెట్లు దక్కాయి.

హెడ్ విజృంభణ:

నిర్దేశిత లక్ష్యఛేదనలో వరుణుడు అంతరాయం కల్గించే సమయానికి ఆసీస్ 12.5 ఓవర్లలో 109/1 స్కోరు చేసింది. ట్రావిస్ హెడ్(59) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. మరో ఓపెనర్ షార్ట్(20) నిరాశపరిచినా..హెడ్ మాత్రం తనదైన శైలిలో అఫ్గన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కెప్టెన్ స్మిత్(19) నాటౌట్‌గా నిలిచాడు.

గ్రూపు-బీ

దేశం	మ్యా	గె	ఓ	ఫ.తె	పా	నె.ర
ఆస్ట్రేలియా	3	1	0	2	4	0.475
దక్షిణాఫ్రికా	2	1	0	1	3	2.140
అఫ్గానిస్థాన్	3	1	1	1	3	-0.990
ఇంగ్లండ్	2	0	2	0	0	-0.305

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ఫ.తె: ఫలితం తేలనవి, పా:పాయింట్లు, నె.ర: రన్‌రేట్

6 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో వర్షం కారణంగా ఎనిమిది సార్లు మ్యాచ్‌లు రద్దయితే అందులో ఆసీస్ ఆరింటిలో భాగమైంది.



కెప్టెన్సీకి బట్లర్ గుడ్‌బై

కరాచీ: ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి జోస్ బట్లర్ గుడ్‌బై చెప్పాడు. ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో శనివారం దక్షిణాఫ్రికాతో మ్యాచ్ తన కెప్టెన్సీలో చివరి మ్యాచ్ అంటూ ప్రకటించాడు. మెగాటోర్నీలో టైటిల్ ఫేవరేట్లలో ఒకటిగా బరిలోకి దిగిన ఇంగ్లండ్ వరుస ఓటములతో లీగ్ దశలోనే వెనుదిరిగింది. ఈ నేపథ్యంలో జట్టు ఓటమికి బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బట్లర్ ప్రకటించాడు. శుక్రవారం జరిగిన మీడియా భేటీలో బట్లర్ మాట్లాడుతూ 'ఇంగ్లండ్ కెప్టెన్సీ నుంచి నేను వైదొలుగుతున్నాను. జట్టుతో పాటు నాకు ఇది సరైన సమయమని భావిస్తున్నాను. చాలా క్లియర్‌గా ఉంది. టోర్నీ అనేది ముఖ్యం. వరుసగా రెండు ఓటములతో టోర్నీ నుంచి వైదొలిగాం. గత కొన్ని సిరీస్‌ల నుంచి జట్టు ప్రదర్శన సరిగ్గాలేదు. నా కెప్టెన్సీకి ఇక్కడితో ముగింపు పడింది. ఇది ఒక రకంగా అవమానకరం' అని అన్నాడు.

ఇస్లామాబాద్ X లాహోర్

● ఏప్రిల్ 11 నుంచి పీఎస్‌ఎల్

లాహోర్: పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్‌ఎల్) 10వ సీజన్ తేదీలు ఖరారయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్ ఇస్లామాబాద్ యునైటెడ్, లాహోర్ ఖ్వాలాండర్స్ జట్ల మధ్య ఏప్రిల్ 11వ తేదీన పోరుతో లీగ్‌కు తెరలేవనుంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం మొత్తం 13 మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది. ఇందులో రెండు ఎలిమినేటర్ మ్యాచ్‌లతో పాటు మే 18న ఫైనల్ మ్యాచ్ ఉంది. మరోవైపు రావల్పిండి స్టేడియంలో 11 మ్యాచ్‌లు, కరాచీలో 5 మ్యాచ్‌లు జరుగనున్నాయి. పీఎస్‌ఎల్ ద్వారా ప్రతిభ కల్గిన ప్లేయర్లు వెలుగులోకి వస్తున్నారని లీగ్ సీఈవో సల్మాన్ నసీర్ పేర్కొన్నాడు. వచ్చే సీజన్ నుంచి ప్రస్తుతమున్న ఆరు జట్లకు తోడు మరో రెండు జట్లు కలుస్తాయని ఆయన తెలిపాడు.

మే 29 నుంచి యూటీటీ లీగ్

న్యూఢిల్లీ: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్(యూటీటీ) ఆరో సీజన్‌కు వేళయైంది. అహ్మదాబాద్ వేదికగా మే 29 నుంచి జూన్ 15వ తేదీ వరకు లీగ్ జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక ఈకేఏ ఎరీనా వేదికగా జరుగనున్న లీగ్‌లో మొత్తం 8 జట్లు పోటీ పడనున్నాయి. ఇందులో ఆతిథ్య భారత్‌తో పాటు పలు దేశాలకు స్టార్ ప్లేయర్లతో పాటు యువ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. లీగ్ ద్వారా విదేశీ ప్లేయర్లతో పోటీపడే అవకాశం లభించిందని జాతీయ టీటీ అసోసియేషన్ కార్యదర్శి కమలేశ్ మెహతా పేర్కొన్నారు. రానున్న సీజన్‌లో ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్ ముచ్చటగా మూడో టైటిల్‌పై కన్నేసింది.

కివీస్ టూర్‌కు సీనియర్లు దూరం!

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీ నుంచి అనూహ్య నిష్క్రమణ తర్వాత రానున్న న్యూజిలాండ్ సిరీస్‌కు పాకిస్థాన్ సీనియర్ ప్లేయర్లు దూరమయ్యే అవకాశం కనిపిస్తున్నది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన పాక్..సొంతగడ్డపై జరుగుతున్న టోర్నీలో కనీసం ఒక్క మ్యాచ్ గెలువకుండానే వైదొలిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 16 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరిగే కివీస్ పర్యటనలో పాక్ ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లు ఆడనుంది. అయితే వరుసగా విఫలమవుతూ జట్టుకు భారంగా మారుతున్న సీనియర్లు బాబర్ ఆజమ్, షాహిన్‌షా ఆఫ్రిదీ, రవూఫ్, నసీమ్‌షా..కివీస్ పర్యటనకు దూరంగా ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జరిగే ఆసియాకప్‌తో పాటు 2027లో జరుగనున్న టీ20 ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే యువ క్రికెటర్లకు అవకాశమిచ్చేందుకు పీసీబీ ప్రయత్నాలు చేస్తున్నది.

ఢిల్లీ ధమాకా

జొనాసెన్, లానింగ్ విజృంభణ | ముంబైపై ఘన విజయం

జొనాసెన్ (3/25)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో నిరుటి రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే ప్రతీ మ్యాచ్ కీలకమైన నేపథ్యంలో ఢిల్లీ దుమ్మురేపింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత జెస్ జొనాసెన్(3/25), మిన్ను మణి(3/17) ధాటికి ముంబై 20 ఓవర్లలో 123/9 స్కోరుకు పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(22), హేలీ మాథ్యూస్(22) మినహా అందరూ స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఢిల్లీ 14.3 ఓవర్లలో విజయాన్నందుకుంది. కెప్టెన్ మెగ్ ల్యానింగ్(49 బంతుల్లో 60 నాటౌట్, 9ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో అదరగొట్టింది. షెఫాలీవర్మ(43) ఆకట్టుకుంది. అమన్‌జోత్‌కు ఏకైక వికెట్ దక్కింది. జొనాసెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

మహిళల కబడ్డీ విజేత హర్యానా

రన్నరప్‌గా తమిళ నాడు జట్టు

అయిజ, ఫిబ్రవరి 28 : పాలుమూరులో మహిళల కబడ్డీ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్ గ్రామంలో మహాశివరాత్రి, రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకొని గురువారం నిర్వహించిన మహిళల కబడ్డీ పోటీలకు వివిధ రాష్ర్టాల నుంచి 15 జట్లు వచ్చాయి. కబడ్డీ పోటీలు అర్ధరాత్రి వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించారు. ఈ పోటీల్లో హర్యానా జట్టు విజేతగా నిలువగా, తమిళనాడు జట్టు రన్నరప్‌గా, తమిళనాడు జీఎల్‌ఎస్ జట్టు మూడో స్థానం, బెంగుళూరు 'ఏ' నాలుగో స్థానం, బెంగుళూరు 'బీ' జట్టు ఐదో స్థానంలో నిలిచాయి. గెలిచిన జట్లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిత్రం

అటు సీరియస్.. ఇటు కామెడీ!

శుక్రవారం హీరో శ్రీవిష్ణు పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన ప్రకటనలను సదరు చిత్రాల మేకర్స్ విడుదల చేశారు. అందులో ఓ సినిమా 'మృత్యుంజయ్'. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో రెబా జాన్ కథానాయిక. హుస్సేన్ షా కిరణ్ దర్శకుడు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మాతలు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. శ్రీవిష్ణు పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్ టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్‌లో శ్రీవిష్ణు ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించిన ఫ్లాష్‌కట్స్‌ని చూడొచ్చు. చాలా ఫాస్ట్‌గా సాగిపోయిన ఈ టీజర్‌లో శ్రీవిష్ణు ఖైదీగా, ఇన్వెస్టిగేటర్‌గా కనిపిస్తున్నారు. విద్యాసాగర్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి కాలభైరవ సంగీత దర్శకుడు. ఇక రెండో సినిమా విషయానికొస్తే.. కొత్త దర్శకుడు యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనున్నది. సుమంత్ నాయుడు జి. నిర్మాత. శ్రీసుబ్రహ్మణేశ్వర సినిమాస్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'క్రేజీ రైడ్ కోసం రండి - బ్రేక్‌లు లేవు.. నవ్వులు మాత్రమే' అనే కోట్ కామెడీ కథాంశంతో సినిమా రూపొందనున్నదని చెబుతున్నది. ఒంగోలు పట్టణం నేపథ్యంలో సినిమా సాగుతుందని పోస్టర్‌లో హోర్డింగ్ తెలియజేస్తున్నది. సత్య, బ్రహ్మజీ, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, గోపరాజు రమణ తదితరులు ఇతర పాత్రలు పోషించనున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: రధన్.

దిల్‌రాజుతో నాలుగో సినిమా?

'పుష్ప-2' వైల్డ్‌ఫైర్‌లా దేశాన్ని మొత్తం చుట్టేసింది. అంతేస్థాయిలో అల్లు అర్జున్ క్రేజ్ కూడా అమాంతం పెరిగిపోయింది. దాంతో ఆయన తదుపరి చిత్రాల విశేషాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అట్లీ, త్రివిక్రమ్ దర్శకత్వం వహించే చిత్రాలకు ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు అల్లు అర్జున్. వీటిలో ఏది తొలుత సెట్స్‌మీదకు వెళ్తుందనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ రెండు చిత్రాలతో పాటు దిల్‌రాజు బ్యానర్‌లో అల్లు అర్జున్ ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్‌తో ఆర్య, పరుగు, డీజే-దువ్వాడ జగన్నాథమ్ వంటి హిట్ చిత్రాల్ని తీశారు దిల్‌రాజు. కొన్నేళ్ల క్రితం 'ఐకాన్' పేరుతో అల్లు అర్జున్‌తో ఓ సినిమా చేస్తానని ప్రకటించారాయన. శ్రీరామ్ వేణుని డైరెక్టర్‌గా అనుకున్నారు. ఎందుకోగాని ఆ సినిమా పట్టాలెక్కలేదు. సుదీర్ఘ విరామం తర్వాత ఇప్పుడు మళ్లీ దిల్‌రాజుకి బన్నీ ఆఫర్ ఇచ్చారని, మంచి కథతో పాటు దర్శకుడు కుదిరితే తాను సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని దిల్‌రాజుతో బన్నీ చెప్పినట్లు టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

కూలీలో దేవాగా తలైవా

సీనియర్ స్టార్లతో సినిమా ఎలా తీయాలో 'విక్రమ్'తో చూపించాడు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ఆ తర్వాత ఈ విషయంలో చాలామంది దర్శకులు 'విక్రమ్' ఫార్ములానే ఫాలో అయ్యారు.. అవుతున్నారు కూడా. కమల్‌హాసన్‌తోనే అంతటి విధ్వంసాన్ని క్రియేట్ చేసిన లోకేష్ కనకరాజ్‌కి మాస్‌కి పర్యాయపదమైన సూపర్‌స్టార్ రజనీకాంత్ దొరికితే ఎలా ఉంటుంది? ఇప్పుడు అభిమానుల్ని ఉత్తేజానికి గురిచేస్తున్న అంశం ఇదే. ప్రస్తుతం ఆయన తలైవాతో 'కూలీ' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. అక్కినేని నాగార్జున, ఉపేంద్ర కీలక పాత్రధారులు. వీరితోపాటు మలయాళ, హిందీ భాషల నుంచి కూడా చాలా మంది ప్రముఖ నటులు ఈ సినిమాలో భాగం అయ్యారని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. 50ఏండ్ల కాల వ్యవధిలో జరిగే ఈ కథలో దేవాగా పవర్‌ఫుల్ పాత్రలో రజనీకాంత్ కనిపిస్తారని, ఆయన పాత్రలో విభిన్న కోణాలుంటాయని, కథలో ఊహించని మలుపులు ఉంటాయని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవలే ఈ సినిమాలోని 45 నిమిషాల పుటేజ్‌ని హీరో సందీప్‌కిషన్ చూశారట. డెఫినెట్‌గా 1000కోట్ల సినిమాగా నిలుస్తుందని ఆయన నమ్మకం వెలిబుచ్చారు. శ్రుతిహాసన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం మే నెలలో విడుదల కానుంది.

తెలుగులో 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ'

కుంచాకో బోబన్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ' ఈ నెలలోనే విడుదలై అక్కడ భారీ విజయం సాధించింది. ఈ సినిమా తెలుగు రాష్ర్టాల హక్కులను ఈఫోర్ సంస్థ దక్కించుకుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ కేసు పరిశోధనలో హరిశంకర్ అనే పోలీస్ అధికారి ఎదుర్కొన్న సవాళ్లు, అతని వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు, వ్యవస్థీకృత నేరాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంశాలను అతను ఎలా డీల్ చేశాడనే అంశాలు ట్రైలర్‌లో ఉత్కంఠను పంచాయి. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్నందించాడు.

సాగరంలో సాహసాలు

ఓవైపు సంగీత దర్శకుడిగా ప్రతిభ చాటుతూనే నటుడిగా కూడా రాణిస్తున్నారు జీవీ ప్రకాష్ కుమార్. స్వీయ నిర్మాణంలో ఆయన నటిస్తున్న తాజా ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'కింగ్స్టన్'. కమల్‌ప్రకాష్ దర్శకుడు. ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మహేశ్వర్ రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. సముద్రం మీద సాహసాలు, అతీతశక్తులు, ఫాంటసీ కలబోసిన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతున్నది. సముద్రంలో హీరో చేసే సాహసాలు రోమాంచితంగా సాగుతాయని, విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యమున్న చిత్రమని మేకర్స్ తెలిపారు. దివ్యభారతి, చేతన్, అళగన్ పెరుమాళ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, దర్శకత్వం: కమల్‌ప్రకాష్.

పురాతన దేవాలయాల్లోని భూగర్భ నేలమాళిగల్లో దాచివుంచిన కోటానుకోట్ల సంపద పరిరక్షణార్థం

సాహసోపేత ఆధ్యాత్మిక ఇతివృత్తం

తాంత్రిక శక్తిని నిక్షిప్తం చేసి, ఏర్పాటు చేసే నాగబంధం నేపథ్యంలో రూపొందుతోన్న సాహసోపేత ఆధ్యాత్మిక ఇతివృత్తం 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణదశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న అనసూయ భరద్వాజ్ ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధాన బలమని, ఒక ఎపిక్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందని నిర్మాత తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పానిండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో నభా నటేష్, అశ్వర్య మీనన్ కథానాయికలు. జగపతిబాబు, రిషబ్ సహానీ, జయప్రకాష్, మురళీశర్మ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్.ఎస్, సంగీతం: అభే, సమర్పణ: లక్ష్మి ఐరా అండ్ దేవాన్ష్, నిర్మాణం: NIK స్టూడియోస్ అండ్ అభిషేక్ పిక్చర్స్.

మ్యాడ్‌కి పదింతల వినోదం

గత ఏడాది బాక్సాఫీస్ వద్ద 'మ్యాడ్' సినిమా చేసిన హంగామా అంతాఇంతా కాదు. ఆ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న సినిమా 'మ్యాడ్ స్కేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ఓఐ ప్రధాన పాత్రధారులు. కల్యాణ్‌శంకర్ దర్శకుడు. హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మాతలు. ఈ నెల 29న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. 'మ్యాడ్'ని మించేలా 'మ్యాడ్ స్కేర్' ఉంటుందని, పొట్టచెక్కలయ్యేలా నవ్విస్తుందని, మరోసారి అవకాశమిచ్చిన దర్శకనిర్మాతలకు థాంక్స్ అని ప్రధాన పాత్రధారులు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ అన్నారు. రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వుకోవాలనుకుంటే ఈ సినిమా చూడాలని చిత్ర సమర్పకులు సూర్యదేవర నాగవంశీ చెప్పారు. 'మ్యాడ్'కి పదింతలు వినోదాన్ని 'మ్యాడ్ స్కేర్' ఇస్తుందని దర్శకుడు కల్యాణ్‌శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు. ఈ నెల 29న థియేటర్లలో ఈ సినిమా చూసి హాయిగా నవ్వుకోండని నిర్మాత హారిక సూర్యదేవర అన్నారు. ఇంకా సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో కూడా మాట్లాడారు. సితార ఎంటర్టైన్మెంట్స్ అండ్ ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్, శ్రీకరా స్టూడియోస్ పతాకాలపై ఈ సినిమాను రూపొందించారు.

అయ్యప్ప భక్తుడైన పోలీసాఫీసర్

ప్రస్తుతం దర్శకత్వం కంటే నటనపైనే దృష్టి పెడుతున్నారు అనురాగ్‌కశ్యప్. గత ఏడాది తమిళ చిత్రం 'మహారాజ'లో ఆయన పోషించిన విలన్ పాత్రకు మంచి పేరొచ్చింది. తాజాగా ఆయన అడివి శేష్ 'డెకాయిట్-ఒక ప్రేమకథ' చిత్రంలో పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. అయ్యప్ప భక్తుడైన పోలీస్ అధికారిగా ధైర్యం, నిజాయితీ కలబోసిన కీలక పాత్రలో అనురాగ్ కనిపిస్తారని మేకర్స్ చెప్పారు. ఇది సవాలుతో కూడుకున్న పాత్రని, కాస్త హాస్యంతో సాగుతుందని అనురాగ్ పేర్కొన్నారు. తనకు ద్రోహం చేసిన మాజీ ప్రియురాలిపై ప్రతీకారం తీర్చుకునే ఓ వ్యక్తి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ ఈ కథ సాగుతుందని దర్శకుడు షనీల్ డియో చెప్పారు. ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు.



ఊహలోన ఊసులాడే..

వినయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకుడు. మరే శివశంకర్ నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలో 'ఊహలోన ఊసులాడే' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. దర్శకుడు సింగార మోహన్ రాసిన ఈ పాటను గుడప్పన్ స్వరపరచగా, సాయిమాధవ్, ఐశ్వర్య దరూరి ఆలపించారు. ప్రేమానుభూతిని కలిగించేలా ఈ పాట సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: వినీత్ పబ్బతి.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.